క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని 33/11 ఇల్లెందు క్రాస్ రోడ్ సబ్ స్టేషన్ 11 కేవీ ప్రశాంతినగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగించనున్నందున ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ బి.తావుర్యా శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంతినగర్, బాలాజీనగర్, యూపీహెచ్ కాలనీ, వేణుగోపాల్‌నగర్, ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సన్మానం..

ఖమ్మం మామిళ్లగూడెం: శ్రమశక్తి అవార్డు గ్రహీత, తెలంగాణ ఉద్యమకారుడు బూరుగు మారుతీరావును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తప్పేట భాస్కర్, రమేష్, గంగాధర్, రామారావు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

ఖమ్మం సహకారనగర్: నగరంలోని డీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో బీకాం, బీఏ విద్యార్థులకు ఫేర్‌వెల్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వి.మోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ శోభారెడ్డిలు మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాశాల ఏఓ వెంకటకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

రఘునాథపాలెం:మండలంలోని కామంచికల్ గ్రామపంచాయతీలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి నేతృత్వంలో మంజూరైన కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ మేదరమెట్ల వెంకటరమణ శనివారం లబ్ధిదారులకు అందించారు. ఉప సర్పంచ్ ప్రభాకర్‌తో పాటు ఎం. శ్రీనివాసరావు, జంగాల ఉపేందర్, నన్నే బోయిన లింగయ్య,కృష్ణ పాల్గొన్నారు.

బుద్ధుడు బోధనలు అనుసరణీయం



నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: గౌతమ బుద్ధుడు బోధనలు అనుసరణీయమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు అన్నారు. బుద్ధుడు జయంతిని పురస్కరించుకొని శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యాన ఖమ్మం సంఘ కార్యాలయంలో బుద్ధుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేసి మాట్లాడారు. బుద్ధుడు బోధనలు సమాజంపై ఎలా ప్రభావితమయ్యాయో వివరించి, సమాజానికి బుద్ధుడు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గుద్దేటి వీరభద్రం, కో కన్వీనర్ బచ్చల పద్మాచారి, సోమరాజ్, రాంబాబ ంనాయక్, కెడ్డి క్యాపిటల్స్ ఖమ్మం జిల్లా కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, పుష్పరాజ్, యేసు, శ్రీధరాచారి, వీరన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మాన్వి ప్రతిభ



మాన్విని అభినందిస్తున్న అతిథులు

ఖమ్మంఅర్బన్: హైదరాబాద్‌లోని రవీంద్ర భారత్ ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి కురగంటి కళాక్షేత్రం–కురగంటి చారిటబుల్ ట్రస్ట్, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ప్రదర్శనలో ఖమ్మం మమత ఆస్పత్రి డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, అనితరావుల కుమార్తె మాన్వి ప్రతిభ చాటింది. పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన 26వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణ, గంగా పురస్కారాలపై ప్రదర్శించి అతిథుల నుంచి అభినందనలతో పాటు ప్రశంసా పత్రం అందుకుంది. ఈ సందర్భంగా పలువురు మాన్విని అభినందించారు.

స్థలం కేటాయించాలి

ఖమ్మంలీగల్: కోర్టు పరిధిలో న్యాయవాదుల అవసరాల మేరకు టైపిస్ట్ కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలని ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ రాశారు. ఈ లేఖను శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్.జగ్జీవన్‌కుమార్‌కు అందజేశారు. అంతేకాక కోర్టు సముదాయంలో వీరికి వసతి కల్పించాలని కోరారు.

వేసవిలో ఫ్రిజ్ కొనకుండ..!

పేదోడి ఫ్రిజ్‌కు భలే గిరాకీ

- వేసవితాపంతో పెరుగుతున్న ఆదరణ
- మార్కెట్‌లో వివిధ రకాల మోడళ్లు
- ఆకర్షణీయంగా బాటిళ్లు, రంజన్లు, కూజాలు
- ఆరోగ్యానికి మేలనడంతో పెరిగిన ప్రాధాన్యం

సండే స్పెషల్



కుండలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఖమ్మంగాంధీచౌక్: ఎండ తీవ్రతలో చల్లని నీళ్లు తాగాలనిపించటం సహజం. సామాన్య, పేద వర్గాలు చల్లని నీటి కోసం మట్టి కుండలే వాడుతుండగా.. మధ్య తరగతి ఆపై వర్గాలు ఫ్రిజ్‌లను వినియోగిస్తుంటారు. ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో ఓ వైపు ఫ్రిజ్‌లు, మరో వైపు మట్టి కుండలకు వారి వారి ఆర్థిక పరిస్థితులను బట్టి తప్పనిసరిగా కొనుగోలు చేయడంతో వాటికి డిమాండ్ బాగా పెరిగింది. సహజ సిద్ధంగా తయారయ్యే మట్టి కుండల నీరు సేవించడం ఆరోగ్యానికి మేలనే విషయం అందరికి తెలిసిందే. పేద వర్గాలు మొదలు, ఉన్నత వర్గాల వరకు వేసవి సీజన్‌లో కుండలో నీటిని తాగటానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇళ్లు, పని ప్రాంతాలు, సామూహికంగా ప్రజలుండే ఆలయాలు, మసీదులు, చర్చిలు, విద్యాలయాలు, వ్యాపార సంస్థలు, జన సాంద్రత అధికంగా ఉండే ప్రాంతాలు, ప్రయాణ కూడళ్లలో మట్టి కుండల వినియోగం బాగా పెరిగింది. పేదవాడి ఫ్రిజ్‌గా పిలుచుకునే మట్టి కుండలు, రంజన్లపై 'సాక్షి'ప్రత్యేక కథనం..

రకరకాల పేర్లు, మోడళ్లు..

మార్కెట్‌లో రకరకాల పేర్లు, మోడళ్లతో కుండల విక్రయాలు జరుగుతున్నాయి. స్థానికంగా తయారు చేసే సాధారణ కుండలతో పాటు భిన్నమైన ఆకృతుల్లో ఉన్న కుండలు విక్రయిస్తున్నారు. స్థానికంగా తయారు చేసే రంజన్లు, కుండలు, ఆదిలాబాద్, నూజివీడు, ఎలగనూరు రాజస్తాన్, గుజరాత్ తదితర ప్రాంతాలకు చెందిన రంజన్లు విక్రయిస్తున్నారు. కులాయి కలిగి 10 నుంచి 30 లీటర్ల స్థాయి వరకు కుండలు, 2 నుంచి 5 లీటర్ల వరకు కెపాసిటీ కలిగిన కూజాలను కూడా విక్రయిస్తున్నారు. వీటితో పాటు మట్టితో చేసిన బాటిల్స్, మట్టి పాత్రలు, గుజరాత్‌కు చెందిన మట్టి కుండలపై ఆకర్షణీయంగా వివిధ డిజైన్లలో రంగులను అద్ది(పేయింటింగ్) విక్రయిస్తున్నారు.

మోడల్‌ను బట్టి ధర..

కుండ సామర్థ్యం, కులాయి ఏర్పాటు వంటి సౌకర్యాలను బట్టి ధరలు ఉన్నాయి. సాధారణ రోజుల్లో కంటే ఎండాకాలంలో కొంత ధర అధికంగా ఉందని చెప్పొచ్చు. 30 లీటర్ల కుండ రకాన్ని బట్టి ధర రూ. 400 వరకు, 25 లీటర్ల కుండ రూ.300 వరకు, 20 లీటర్ల కుండ రూ.280 వరకు ధరలు ఉన్నాయి. కూజాలు సైజును బట్టి రూ. 200ల నుంచి రూ. 150 వరకు ఉన్నాయి. బాటిల్స్ ధర రకం, రంగును బట్టి రూ. 120 నుంచి రూ. 180 వరకు ఉన్నాయి. ఇక గుజరాత్ కుండ ధర మాత్రం రూ. 650లకు విక్రయిస్తున్నారు. ఖమ్మం నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద, జెడ్పీసెంటర్, చర్చి కాంపౌండ్, కాల్వొడ్డు, మయూరిసెంటర్ బ్రిడ్జి కింద, బస్ డిపోరోడ్, ముస్తఫా నగర్, రోటరీ నగర్, ఖానాపురం, బల్లేపల్లి, ఖానాపురం తదితర ప్రాంతాల్లో కుండల విక్రయాలు సాగుతున్నాయి. జన సంచారం ఉన్న ప్రాంతాల్లో రహదారుల పక్కన కుండల విక్రయాలు జరుగుతున్నాయి.





వివిధ ఆకృతుల్లో తయారు చేసిన మట్టి బాటిళ్లు

కుండ కొనాల్సిందే..



ప్రతి వేసవి సీజన్‌లో కొత్త కుండను తప్పకుండా కొనాల్సిందే. కొత్త కుండలో తాగే నీరు చల్లగా ఉండటమే గాక రుచికరంగా కూడా ఉండి ఎక్కువగా తాగడంతో పాటు దాహం తీరుతుంది. కుండ నీటిని తాగటం వలన ఆరోగ్యానికి కూడా ప్రయోజనం కలుగుతుంది. కుండ ధరను పరిగణలోకి తీసుకోకుండా ప్రతి ఏడు కొంటాం.

– కురుపమ్మ, గృహిణి, బల్లేపల్లి

విద్యార్థుల కోసం..



ప్రభుత్వ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఏటా కొత్త కుండలను కొనుగోలు చేస్తాం. ఈ ఏడు నాలుగు కుండలు కొన్నాం. ప్రతి రోజు కుండలను శుభ్రం చేసి నీటిని నింపుతాం. విద్యార్థులు, సిబ్బంది, ఉద్యోగులు అంతా కుండల్లో నీటిని తాగుతారు.

– కొండా శ్రీనివాస్, ఉద్యోగి, ప్రభుత్వ పీజీ కాలేజ్

డిమాండ్ పెరిగింది..



ఎండ తీవ్రత పెరిగితే కుండల విక్రయాలు పెరుగుతాయి. ఉద్యోగులు ప్లాస్టిక్ బాటిల్స్ స్థానంలో మట్టి బాటిల్స్‌ను వినియోగిస్తున్నారు. పేదలతో పాటు అన్ని వర్గాల ప్రజలు కుండలు, రంజన్లు, కూజాలు కొనుగోలు చేస్తున్నారు. వేసవి సీజన్‌లో కుండల విక్రయాలతో ఉపాధి పొందుతున్నాం.

– దునుకు పుష్ప, కుండల విక్రయదారురాలు, ఇల్లెందు క్రాస్‌రోడ్

ఉచిత వైద్యసేవలతో ప్రజలకు మేలు



మందులు అందజేస్తున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రతినెలా నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలతో పేదలు, మధ్యతరగతి ప్రజలకు వైద్యం అందుబాటులోకి వస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక మంచికంటి భవన్ లో సీపీఎం ఖమ్మం టూ టౌన్ కమిటీ, బోడేపూడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన బీపీ, షుగర్ మెడికల్ క్యాంపు నిర్వహించగా పెద్దసంఖ్యలో హాజరైన వారికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం నున్నా మాట్లాడుతూ ప్రతినెలా ప్రత్యేక వైద్యనిపుణుడితో వైద్యశిబిరాలు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. వైద్యులు సి.భారవి, రావిళ్ల రంజిత్, కొల్లి అనుదీప్, పి.సుబ్బారావు, జెట్ల రంగారావుతో పాటు సీపీఎం నాయకులు వై.విక్రమ్, వై.శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, సుబ్బారావు, పి.ఝాన్సీ, అఫ్జల్, వాసిరెడ్డి వీరభద్రం, నర్రా రమేష్, కాంపాటి వెంకన్న, కళ్యాణం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అవినీతిపరులను బహిర్గతం చేయాలి

కూసుమంచి/ఖమ్మంమామిళ్లగూడెం: దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల జాబితాను విడుదల చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పాలేరు డివిజన్ ఇన్‌చార్జ్ వి.ఆనందరావు డిమాండ్ చేశారు. శనివారం కూసుమంచి మండల కేంద్రంలో అవినీతిపరుల జాబితాను బహిర్గతం చేయాలని కోరుతూ జరిగిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఖమ్మం ధర్నాచౌక్‌లో చేపట్టిన దీక్ష మూడోరోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో నాయకులు పి.ఈదయ్య, టి.వెంకన్న, వి.హనుమంతరావు, కె.రవీంద్రబాబు, నరసింహారావు , అంజయ్య, రాము, సైదులు, సురేష్, రామారావు, మధు, రమా,మంగమ్మ, టి.సురేష్, పి.బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని సీపీఎం మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతల చెర్వు కోటేశ్వరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సీపీఎం మధిర నియోజకవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. కల్లాలు, రోడ్ల వెంబడి ఆరబోసిన వరి, మొక్కజొన్న వంటి పంటలు వర్షానికి తడిసినా ప్రభుత్వం షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయాలని, ఎకరానికి రూ.10 వేలు హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరావు, జిల్లా కమిటీ సభ్యులు నరసింహారావు, పద్మ, నాగేశ్వరావు, గోపాల్‌రావు, వీరయ్య పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి



రఘునాథపాలెం: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఈ రామారావు

నేలకొండపల్లి/రఘునాథపాలెం: విద్యుత్ పట్ల అజాగ్రత్తగా ఉండి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఏఈ కె.రామారావు, విద్యుత్‌శాఖ డీఈ ఆపరేషన్ ఎస్.రామారావులు వినియోగదారులకు సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం నేలకొండపల్లిలో ఏఈ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆదివారం కూసుమంచి రైతు వేదికలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే రఘునాథపాలెం రైతు వేదికలో రఘునాథపాలెం విద్యుత్ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని బల్లెపల్లి, రఘునాథపాలెం, మంచుకొండ సెక్షన్లకు సంబంధించిన సిబ్బంది, వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఈ అవగాహన కల్పించారు. పలువురు సీనియర్ సిబ్బంది గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదాలను విశ్లేషించి, విద్యుత్ ప్రమాదాలను నివారించుటకు తగిన జాగ్రత్తలు చెప్పారు. కూసుమంచిలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ రవి, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, నూక నాగేశ్వరరావు, జేఎల్ఎంలు పాల్గొనగా.. రఘునాథపాలెం సదస్సులో డీఈ టెక్నికల్ వీ.సీ.హెచ్.బాబూరావు, ఏడీ సంజయ్‌కుమార్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా మంచుకొండ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కె.సంధ్యారాణి పాల్గొని ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తీసుకోనవలసిన జాగ్రత్తలు, సీపీఆర్ చేయు విధానం గురించి సిబ్బందికి వివరించారు.

ఘర్షణ విషయంలో నలుగురిపై కేసు

తిరుమలాయపాలెం: కోళ్ల దాణా కొనుగోలు విషయమై ఘర్షణకు దిగిన నలుగురిపై కేసు నమోదైంది. మండలంలోని బంధంపల్లికి చెందిన కోళ్ల వ్యాపారి గొర్రెపాటి ప్రశాంత్ దాణాగా బియ్యం, నూకలు కొనుగోలు చేస్తున్నాడు. బచ్చోడులో గొర్రెపాటి నాగయ్య వద్ద బియ్యం కొనుగోలు చేసే క్రమాన మాటమాట పెరిగి కర్రలతో కొట్టుకున్నారు. ఈ ఘటనలో ప్రశాంత్, నాగయ్యతో పాటు యాకయ్య, వీరస్వామిపై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏకలవ్యుడి విగ్రహాన్ని ధ్వంసం చేయడం సరికాదు

ఖమ్మంరూరల్: తల్లంపాడులో ఏర్పాటు చేసిన ఏకలవ్యుడి విగ్రహాన్ని ధ్వంసం చేయడం సరికాదని, ఈ చర్యకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గిరిజన రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి. కృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు కావాలనే విగ్రహాన్ని ధ్వంసం చేశారని, ఎరుకుల వర్గానికి చెందిన వారు అధికార బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారనే కక్షతో ఇలా చేశారని ఆరోపించారు. అనంతరం విగ్రహ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రాస్తారోకో చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అవమానించి వెళ్లగొట్టారని ఫిర్యాదు

నేలకొండపల్లి: దివ్యాంగురాలినని అవమానించడమే కాకుండా దాడి చేసి వెళ్లగొట్టిన అత్తింటి వారిపై చర్యలు తీసుకోవాలని ఓ వివాహిత పోలీసులను ఆశ్రయించింది. మండలంలోని మంగాపురం తండాకు చెందిన దివ్యాంగురాలు భూక్యా గాయత్రికి 2020లో రంజిత్‌కుమార్‌తో వివాహమైంది. ఇటీవల భర్త, అత్త ఆమెను హేళన చేయడమే కాక భౌతికంగా హింసిస్తుండడంతో పెద్దల సమక్షాన పంచాయితీ పెట్టినా మార్పు రాలేదు. అలాగే, శనివారం తీవ్రంగా కొట్టి పుట్టింటికి పంపించడంతో ఆమె దివ్యాంగుల జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్యతో కలిసి గాయత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కొండచిలువ హతం

నేలకొండపల్లి: మండల పరిధిలోని సుర్దేపల్లి గ్రామంలో శనివారం ఓ కొండచిలువను గ్రామస్తులు హతమార్చారు. వరిపొలంలో కోత మిషన్ ద్వారా వరి కోస్తుండగా కొండచిలువను స్థానికులు గమనించి హతమార్చారు. దాదాపు 10 అడుగుల పొడువు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చేద్దాం



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో ప్రజలకు అమలవుతున్న సంక్షేమ పథకాలు నిలిచిపోవద్దన్నా, రైతులకు రైతుబంధు, ఉచిత కరెంట్ అందాలన్నా కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని, ఖమ్మం బాగుండాలంటే తనను మూడవసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారంఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను బీసీల పక్షపాతినని అందుకే నగర బీఆర్ఎస్ అధ్యక్షుడిగా పగడాల నాగరాజును నియమించడమే కాక డీసీసీబీ, మార్కెట్, సుడా చైర్మన్ పదవులు వారికే కేటాయించామన్నారు. ఇక గుండాల కృష్ణ, కమర్తపు మురళికి సైతం త్వరలోనే మంచి పదవులు రానున్నాయని చెప్పారు. ఖమ్మం ప్రజలు ఒకతాటిపై ఉండాలని, ఎవరికో కడుపు నొప్పి వచ్చిందని వారు తలనొప్పి తెచ్చుకోకూడదని సూచించారు. కేసీఆర్‌ను పడగొడతాం, ప్రభుత్వాన్ని పడుగొడతామని కొందరు అంటున్నారని.. అదే జరిగితే ప్రజలకే నష్టమన్నారు. ఎన్నికల వేళ ఎవరో రెచ్చగొడితే ఆగం కాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ మళ్లీ ఆశీర్వదించాలని సూచించారు. అనంతరం 117మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి లబ్ధిదారులకు మంత్రి వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు.

బస్తీ దవాఖానా ప్రారంభం..

నగరంలోని 34వ డివిజన్‌లో రూ.27.50 లక్షలతో నిర్మించిన బస్తీ దవాఖానా, యోగ కేంద్రాన్ని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. పేదలకు అందుబాటులో మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మాదిరిగానే అన్ని సేవలు, మందులు అందిస్తామని వెల్లడించారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ..

ఖమ్మం 17వ డివిజన్ శ్రీనివాస్ నగర్ కాల్వకట్టపై నివాసముంటున్న పేదలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓ 58, 59 ద్వారా మంజూరైన పట్టాలను మంత్రి పువ్వాడ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో నివాసముంటున్న వారికి పూర్తి హక్కు కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఖమ్మంలో 2,800 మందికి పట్టాలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈకార్యక్రమాల్లో డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్, మార్కెట్ చైర్‌పర్సన్ దోరెపల్లి శ్వేత, ఆర్డీఓ రవీంద్రనాథ్, తహసీల్దార్ శైలజ, కార్పొరేటర్ కమర్తపు మురళితో పాటు పగడాల నాగరాజు, వలరాజు, కోటేశ్వరరావు, రుద్రగాని శ్రీదేవి, ధనాల రాధ, గజ్జెల లక్ష్మి, అమృతమ్మ, నిరీష, బత్తుల మురళీప్రసాద్, గుండాల కృష్ణ, పాలడుగు పాపారావు, ధనాల శ్రీకాంత్, మాటూరి లక్ష్మీనారాయణ, నీలం కృష్ణ పాల్గొన్నారు.

కమర్తపు మురళికి సన్మానం..



మురళిని సన్మానిస్తున్న మంత్రి

పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కమర్తపు మురళిని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఇంకా డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్, నాయకులు, ప్రజాప్రతినిధులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, దండా జ్యోతిరెడ్డి, షేక్ షకీనా, షేక్ అబ్బాస్ కూడా మురళికి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే కందాల విస్తృత పర్యటన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందాల

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గ శాసనసభ్యుడు కందాల ఉపేందర్‌రెడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం విస్తృతంగా పర్యటించారు. పలు గ్రామాల్లో డబుల్ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. రాజేశ్వరపురంలో డబుల్ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమంలో అనర్హులకు ఇళ్లను కేటాయించారని మునగంటి వీరబాబు అనే వ్యక్తి ఆందోళన చేపట్టారు. బాధితుడిని అధికారులు, పోలీసులు నచ్చచెప్పి పంపించారు. సర్పంచ్ దండా పుల్లయ్య కూడా డబుల్ ఇళ్ల కేటాయింపుపై తనకు తెలియకుండానే రాత్రికి రాత్రే గృహ ప్రవేశం చేయించారని ఆరోపించారు. అదేవిధంగా రాయగూడెంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తర్వాత కల్యాణలక్ష్మి, షాదీముబారక్ 53 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ నంబూరి శాంత, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, తహసీల్దార్ దారా ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్‌లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో రాజీలేదు..

ఖమ్మంరూరల్: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాజీ పడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఏదులాపురం, కొండాపురంలలో ఒక్కో భవనం రూ. 20లక్షలతో నిర్మించనున్న ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలకు శనివారం శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ముత్తగూడెంలో వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీ ఎ.వరప్రసాద్, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

మండలంలోని మంగళగూడెంలో భూవివాదం ఘర్షణలో గాయపడి ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పి.నర్సయ్య, నాగరాజులను ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి శనివారం రాత్రి పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ ఏ.వరప్రసాద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

యువత ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

నేలకొండపల్లి: యువత ప్రజాహిత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని రాజేశ్వరపురం సర్పంచ్ దండా పుల్లయ్య సూచించారు. మండలంలోని రాజేశ్వరపురంలో శనివారం రామబాణం యూత్, సంకల్ప వలంటీర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల కోసం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంపీటీసీ చంద్రమ్మ, భక్తరామదాసు సర్వీస్ సొసైటీ మాజీ అధ్యక్షుడు యలమద్ది లెనిన్, ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ సొందుమియా, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాన మాధురి

ఖమ్మంగాంధీచౌక్:ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఖమ్మం నగరంలోని జూబ్లీక్లబ్‌లో నిర్వహించిన గాన మాధురి మధుర గీతాల కార్యక్రమం అలరించింది. అసోసియేషన్ ప్రతినిధి, కార్యక్రమ నిర్వాహకులు అంజాద్ పాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు వి.రమేష్‌రావు, ఐ.రామ్ శ్రీదేవిలు సరస్వతీ మాతా చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించారు. గాయనీ, గాయకులు ఎస్వీ రమణ, కెనార్డన్, ఎండీ జాఫర్, ప్రకాష్, శివలీల, నాగస్వర్ణశ్రీ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో గత ఆరు రోజులుగా కోడ్‌తంత్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సు పైథాన్ ప్రోగ్రాం శనివారంతో ముగిసినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, సుభాష్ చందర్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇత్తడి ద్వారం ఏర్పాటు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో తెనాలికి చెందిన శిల్పి కళాకారుడు అక్కల రామలింగేశ్వరకుమార్ చేతుల మీదుగా ఇత్తడి ద్వారాన్ని శనివారం అమర్చారు. నేలకొండపల్లికి చెందిన దాతలు సాయంతో మందిర ప్రధాన ద్వారానికి ఇత్తడితో తొడుగును ఏర్పాటు చేశారు. భక్తరామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పాలడుగు పూర్ణచందర్‌ప్రసాద్, దేవాలయం కమిటీ ప్రతినిధులు అక్కినేని నాగేశ్వరరావు, కొంగర నారాయణరావు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలి

తిరుమలాయపాలెం/కూసుమంచి: పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని వైఎస్సార్‌టీపీ నాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి, సంఘం మండల అధ్యక్షుడు ఎ. అంజయ్య డిమాండ్ చేశారు.శనివారం పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు సంఘీభావం ప్రకటించిన సందర్భంగా వారు మాట్లాడారు. కూసుమంచిలో కార్యదర్శులు రంగవల్లులు వేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తా బాలాజీ, జగన్నాథరెడ్డి, సత్యనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.